
# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 13 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 4







బోయింగ్ 787-8 ఎయిర్ ఇండియా విమానం మధ్యాహ్నం 1.38 గంటలకు టేకాఫ్ అయిన ఐదు నిమిషాల్లోనే గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో మెడికల్ కాలేజీ హాస్టల్‌పై కుప్పకూలింది.

# కుప్పకూలిన విమానం

## 242 మంది దుర్మరణం
## గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కన్నుమూత

- గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఘటన
- మృతుల్లో 230 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బంది
- క్షేమంగా బయటపడ్డ ఒకేఒక్కడు
- బ్రిటన్ వెళుతుండగా దుర్ఘటన
- టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ప్రమాదం
- ఘటనపై ప్రధాని మోడీ, సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి





**బలగం టీవీ, అహ్మదాబాద్ బ్యూరో**

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ విమానం గురువారం అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయి పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం వెలుపల నివాస ప్రాంతాలపై కుప్పకూలింది. బయలుదేరిన తొమ్మిది నిమిషాలకే విమానం మంటల్లో చిక్కుకొని కూలడంతో నగరమంతా దట్టమైన నల్లని పొగ వ్యాపించింది. ఆ విమానంలోని ఉన్న గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ సహా 242 మంది మృతిచెందారు. ఈ మేరకు గుజరాత్ ప్రభుత్వం ప్రకటన చేసింది. వీరిలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్ జాతీయులు, ఏడుగురు పోర్చుగల్ పౌరులు, ఒక కెనడియన్ ఉన్నారు. ప్రమాద స్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, డీఎన్ఏ టెస్ట్‌ల అనంతరం మృతదేహాలను గుర్తించనున్నట్టు గుజరాత్ ఆరోగ్య శాఖ అదనపు కార్యదర్శి ధనుంజయ ద్వివేది తెలిపారు. డీఎన్ఏ పరీక్షల కోసం ప్రయాణికుల బంధువులు శాంపిల్స్ ఇవ్వాలని ఆయన కోరారు. డీఎన్ఏ పరీక్షల్లో గుర్తించిన తర్వాతే బంధువులకు మృతదేహాలను అప్పగిస్తామని చెప్పారు. క్షతగాత్రులకు వివిధ ఆస్పత్రులలో చికిత్స అందిస్తున్నారు.



అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 1.38 గంటలకు బయలుదేరిన బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ ట్విన్ జెట్ కొద్దిసేపటికే మేఘనీనగర్ ఘోడాసర్ ప్రాంతంలోని బీజీ వైద్య కళాశాల వసతిగృహంపై కూలిపోయింది. ప్రమాదంలో అనేక మంది వైద్య విద్యార్థులు కూడా ప్రాణాలు కోల్పోయారని తెలుస్తోంది. భోజన సమయం కావడంతో పలువురు విద్యార్థులు హాస్టల్‌లోనే ఉన్నారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగి సహాయ కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక అగ్నిమాపక, ఎమర్జెన్సీ సిబ్బంది కూడా సంఘటనా స్థలానికి చేరుకొని సహాయ కార్యక్రమాల లో భాగస్వాములయ్యారు. ప్రమాద స్థలానికి కనీసం 24 అంబులెన్సులు రాగా.. క్షతగ్రాతులను తరలించడానికి పోలీసులు గ్రీన్ కారిడార్ ఏర్పాటుచేశారు. ప్రమాదంపై పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, ఈ పరిస్థితిని స్వయంగా పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. అన్ని విమానయాన, అత్యవసర స్పందనా సంస్థలు వేగంగా, సమన్వితంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎయిర్ ఇండియా బాధితుల కోసం ప్రత్యేకంగా హాట్‌లైన్ నెంబర్ 1800 5691 444 ఏర్పాటు చేసింది. ప్రధాని నరేంద్ర మోడీ ఎప్పటికప్పుడు అధికారులు, మంత్రులను సంప్రదిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద సమయంలో పైలెట్ సుమిత్ సభర్వాల్, కో–పైలట్ క్లైవ్ కుందర్ డ్యూటీలో ఉన్నారు. వీరిద్దరూ అనుభవజ్ఞులే. సభర్వాల్‌కు 8,200 గంటలు, కుందర్‌కు 1,100 గంటలు విమానాలను నడిపిన అనుభవం ఉంది.

పోలీస్ కంట్రోల్ రూమ్ అందించిన సమాచారం ప్రకారం ఎయిర్ ఇండియాకు చెందిన ఏ1–171 విమానం లండన్‌లోని గట్విక్ వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఆ వెంటనే విమాన సిబ్బందిని సంప్రదించేందుకు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. '23వ రన్‌వే నుంచి బయలుదేరిన విమానం కొద్దిసేపటికే ఎయిర్‌పోర్ట్ వెలుపల జనావాసాలపై కూలిపోయింది. సంఘటనా స్థలం నుంచి పెద్ద ఎత్తున పొగలు వ్యాపించాయి' అని డీజీసీఏ వర్గాలు తెలిపాయి. కూలడానికి ముందు విమానం ప్రమాద సంకేతంగా 'మేడే కాల్' జారీ చేసింది. ఆ తర్వాత ఏటీసీతో సంబంధాలు తెగిపోయాయి. ప్రమాద కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. పౌర విమానయాన డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ), ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) విచారణ చేపట్టాయి. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా హుటాహుటిన అహ్మదాబాద్ చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాద నేపథ్యంలో అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలను తాత్కాలికంగా కొంతసేపు నిలిపివేశారు. విమానం 174 నాట్స్ వేగంతో ప్రయాణిస్తూ 625 అడుగుల (190.5 మీటర్లు) ఎత్తులో సిగ్నల్స్ కోల్పోయి వేగంగా కిందికి పడిపోయింది. వీటీ–ఏఎన్‌బీ రిజిస్ట్రేషన్ కలిగిన ఈ విమానాన్ని 2014లో ఎయిర్ ఇండియాకు సరఫరా చేశారు. ప్రపంచంలో గతంలో బోయింగ్ 787 విమానాలు ప్రమాదానికి గురైన దాఖలాలేవీ లేవు. ఈ మోడల్ విమానాలకు భద్రతా పరంగా మంచి రికార్డు ఉంది. ఎయిర్ ఇండియా నడుపుతున్న 27 బోయింగ్ 787–8 డ్రీమ్‌లైన్స్ జెట్లలో ఇది ఒకటి. ప్రమాదానికి గురవడానికి ముందు ఈ విమానం న్యూఢిల్లీ నుంచి అహ్మదాబాద్‌కు వచ్చింది. గడిచిన నాలుగు దశాబ్దాల కాలంలో ఎయిర్ ఇండియా విమానం భారీ ప్రమాదానికి గురవడం ఇదే మొదటిసారి. కాగా విమాన ప్రమాదం జరిగిన తర్వాత సుమారు 150 మంది సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారని సీఆర్‌పీఎఫ్ తెలిపింది.



అహ్మదాబాద్‌లోజరిగిన విమాన ప్రమాదం గురించి తెలిసి తీవ్రంగా కలత చెందాను. ఇది హృదయ విదారకర ఘటన. దీనిపై మాటలు రావట్లేదు. ఈ క్లిష్ట సమయంలో దేశం బాధితులకు తోడుగా నిలుస్తుంది" –

**– రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము**




"అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఈ విషాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ హృదయ విదారక ఘటన మాటలకందని విషాదం. ఈ విపత్కర సమయంలో బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. సహాయక చర్యలపై మంత్రులు, సంబంధిత అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నా"

**– ప్రధాని నరేంద్ర మోదీ**



"విమాన ప్రమాదం వార్త వినగానే హృదయం ముక్కలైంది. బాధిత కుటుంబాల ఆవేదన వర్ణణాతీతం. ఈ క్లిష్ట సమయంలో ప్రతి క్షణం, ప్రతి క్షణం విలువైనదే. సహాయకచర్యలు వేగంగా జరగాలి. క్షేత్రస్థాయిలో ఎలాంటి సాయం చేయడానికైనా కాంగ్రెస్ కార్యకర్తలు ముందుండాలి"

**– కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ**



లండన్ గాట్విక్‌కు బయల్దేరిన విమానం ప్రమాదానికి గురైన ఘటనపై బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయని విచారం చెందారు. పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నట్లు వెల్లడించారు

**– బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్**



ఈ ఘటన కలిచి వేసింది. బాధితులను, వారి కుటుంబాలను ఆదు కోవడానికి కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన సమర్థవంతంగా సహాయక చర్యలు చేపట్టాలి. మృతుల కుటుంబాలకుసంతాపం తెలుపుతున్నాను

**– తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి**



నివాసాలపై విమానం కూలిపోయిన ఘటనలో ప్రయాణికులు, సామాన్యులు, వైద్య విద్యార్థులు మరణించడం విచారకరం ఆప్తులను కోల్పోయి శోకతప్త హృదయులైన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను. మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలి. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలి. మృతుల కుటుంబాలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కేంద్రంతోపాటు గుజరాత్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

**–తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్**

## విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ సీఎం మృతి

**బలగం టీవీ, అహ్మదాబాద్ బ్యూరో**



గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరంలో ఉన్న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌కు గురువారం బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ చేసిన కొద్ది సేపటికే విషాదానికి గురయింది. ఈ దుర్ఘటనలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మృతిచెందారని కేంద్ర మంత్రి సి.ఆర్.పాటిల్ తెలిపారు. 'రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన విజయ్ రూపానీ విమానం కూలిపోయిన ఘటనలో మృతిచెందడం చాలా విషాదకర విషయం. ఇది బిజెపి కుటుంబానికి ఓ విషాద వార్త' అని కేంద్ర జలశక్తి మంత్రి, బిజెపి రాష్ట్ర యూనిట్ చీఫ్ అయిన పాటిల్ విలేకరులతో అన్నారు.విజయ్ రూపానీ(68) రెండుసార్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన 2016 ఆగస్టు 7 నుంచి 2021 సెప్టెంబర్ వరకు సిఎం పదవిలో ఉన్నారు. ఆయన పశ్చిమ రాజ్‌కోట్ స్థానం నుంచి గుజరాత్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన పంజాబ్ బిజెపి ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. రూపానీ తన భార్య అంజలిబెన్ రూపానీని తిరిగి తీసుకురావడానికి లండన్‌కు వెళుతున్నారని ఆయన కుటుంబానికి సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. రూపానీ భార్య ఆరు నెలలుగా అక్కడే ఉంటున్నట్లు తెలుస్తోంది. రూపానీ బిజినెస్ క్లాస్ విభాగంలో 2–%ణ%లో కూర్చున్నట్లు విమాన రికార్డులు నిర్ధారించాయి.

## ఒకే ఒక్కడు మృత్యుంజయుడు..

**బలగం టీవీ, అహ్మదాబాద్ బ్యూరో**



గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో ఒకరు బతికినట్లు తెలుస్తోంది. 38 ఏళ్ల రమేశ్ విశ్వకుమార్ అనే వ్యక్తి ప్రాణాలతో ఉన్నారు. బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్‌లో.. 11ఏ సీటులో అతను కూర్చున్నట్లు సమాచారం. ప్రస్తుతం అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విమాన ప్రమాదంలో 242 మంది మరణించినట్లు ధ్రువీకరించినా.. రమేశ్ కుమార్ మాత్రం ఆ విమానం నుంచి గాయాలతో బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. ఆ మృత్యుంజయుడి వివరాలు మరిన్ని అందాల్సి ఉన్నది. విమానంలో ఉన్న ఎమర్జెన్సీ ఎగ్జిట్ నుంచి అతను దూకినట్లు భావిస్తున్నారు. ఆ మిరాకల్ ఘటనకు చెందిన ఓ వీడియో కూడా వైరల్ అవుతున్నది. అంబులెన్స్ వద్దకు రమేశ్ కుమార్ నడిచి వస్తున్న దృశ్యాలను రిలీజ్ చేశారు.

## జిల్లా ఇంఛార్జి మంత్రులు మార్పు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ అనంతరం, సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర పరిపాలనను మరింత సమర్థంగా నిర్వహించేందుకు జిల్లాల ఇంఛార్జి మంత్రుల్లో మార్పులు చేశారు. పలు జిల్లాలకు కొత్త మంత్రులను ఇంఛార్జిగా నియమిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. పాత మంత్రులకు కేటాయించిన జిల్లాలను మార్చింది. మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా గడ్డం వివేక్ వెంకటస్వామి బాధ్యతలు అప్పగించింది. నల్లగొండకు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఖమ్మం జిల్లాకు వాకిటి శ్రీహరి, ఆదిలాబాద్‌కు జూపల్లి కృష్ణారావు బాధ్యతలు అప్పగించింది. నిజామాబాద్ ఇన్‌చార్జిగా సీతక్క, కరీంనగర్‌కు తుమ్మల నాగేశ్వర రావు, మహబూబ్‌నగర్‌కు దామోదర్ రాజనర్సింహా, రంగారెడ్డి జిల్లాకు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్‌చార్జిగా పొన్నం ప్రభాకర్, వరంగల్ జిల్లా ఇన్‌చార్జిగా పొంగులేటి శ్రీనివాస రెడ్డికి బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.

## తిరుపతి-కరీంనగర్ మధ్య 8 ప్రత్యేక రైళ్లు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రయాణీకుల రద్దీ దృష్టా దక్షిణ మధ్య రైల్వే తిరుపతి, కరీంనగర్ మధ్య 8 వీక్లీ స్పెషల్ రైళ్లు నడుపనుంది. జులై 6 నుండి 27వ తేదీ వరకు తిరుపతి–కరీంనగర్ (02761) ప్రత్యేక రైళ్లు ప్రతి ఆది వారం, జులై 7 నుండి 28 వరకు కరీంనగర్–తిరుపతి (02762) ప్రత్యేక రైళ్లు ప్రతి సోమవారం నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ఈ ప్రత్యేక రైళ్లు రేణిగుంట, గూడుర్, నెల్లూర్, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, మధిర, ఖమ్మం, డోర్నకల్, మహబూబాబాద్, వరంగల్, జమ్మికుంట, పెద్దపల్లి స్టేషన్‌లలో ఆగుతాయని అధికారులు తెలిపారు.

**బెంగళూరు, బీదర్ మధ్య 10 ప్రత్యేక రైళ్లు**

ప్రయాణీకుల రద్దీ దృష్టా దక్షిణ మధ్య రైల్వే ఎస్ఎంవిటి బెంగళూరు, బీదర్ మధ్య 10 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు తెలిపింది. జూన్ 15 నుండి 29 వరకు ఎస్ఎంవిటి బెంగళూరు బీదర్ (06539) ప్రత్యేక రైలు ప్రతి శుక్ర, ఆదివారాల్లో, ఈ నెల 16 నుండి 30 వరకు బీదర్–ఎస్ఎంవిటి బెంగళూరు (06540) ప్రత్యేక రైలు ప్రతి శని, సోమవారాల్లో నడుస్తాయని దక్షిణ మధ్య రైల్వే సిపిఆర్ఓ ఎ. శ్రీధర్ తెలిపారు. ఈ రైళ్లు యెలహంక, హిందూపూర్, ధర్మవరం, అనంతపూర్, గుంతకల్, ఆదోని, మంత్రాలయం రోడ్, రాయిచూర్, క్రిష్ణ, యాద్గిర్, వాడి, షాబాద్, కలబుర్గి, హుమ్నాబాద్ స్టేషన్‌లలో ఆగుతుందని తెలిపారు.

## మెడికల్ కాలేజీ హాస్టల్ పై కూలిన విమానం

- పెదుగురు వైద్య విద్యార్థుల మృతి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరంలో ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే బీజే మెడికల్ కాలేజీ విద్యార్థుల హాస్టల్‌పై కుప్పకూలడం తెలిసిందే. ఈ ఘోర దుర్ఘటనలో నలుగురు అండర్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు, ఒక పోస్ట్ గ్రాడ్యుయేట్ రెసిడెంట్ సహా మొత్తం ఐదుగురు మరణించారు. అనేక మంది విద్యార్థులు, వైద్యులు తీవ్రంగా గాయపడ్డారు. బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ విమానం సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 1:38 గంటలకు లండన్‌కు బయలుదేరింది. అయితే, టేకాఫ్ అయిన కొద్దిసేపటికే, కేవలం 825 అడుగుల ఎత్తులో ఉన్నప్పుడే విమానం పైకి లేవడంలో విఫలమై, సమీపంలోని బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ భవనాన్ని బలంగా ఢీకొట్టింది. ప్రమాద సమయంలో హాస్టల్ క్యాంటీన్‌లో విద్యార్థులు భోజనం చేస్తున్నారని, అక్కడ చెల్లాచెదురుగా పడి ఉన్న ప్లేట్లు, గ్లాసులు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. హాస్టల్ మెస్ గోడ కూడా ప్రమాద తీవ్రతకు దెబ్బతిన్నది. విమాన శకలాలు హాస్టల్ భవనంలోకి చొచ్చుకుపోయిన దృశ్యాలు భయానకంగా ఉన్నాయి. ఈ దుర్ఘటనలో సుమారు 40 మంది వైద్యులు గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. "నేను, నా జూనియర్ డాక్టర్ గాయపడ్డాం. మరో 30–40 మంది అండర్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులకు కూడా గాయాలయ్యాయి. ఒకరిద్దరు విద్యార్థుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది," అని బీజే మెడికల్ కాలేజీకి చెందిన డాక్టర్ శ్యామ్ గోవింద్, ప్రమాదాన్ని కళ్లారా చూసిన వ్యక్తి, ఎన్డీటీవీతో మాట్లాడుతూ చెప్పారు. ప్రమాద సమయంలో హాస్టల్‌లో ఉన్న తన కుమారుడు భోజన విరామంలో అక్కడికి వెళ్లాడని, విమానం కూలడంతో ప్రాణాలు కాపాడుకోవడానికి రెండో అంతస్తు నుంచి దూకాడని ఓ విద్యార్థి తల్లి రమీలా తెలిపారు. "నా కొడుకు క్షేమంగానే ఉన్నాడు, అతనితో మాట్లాడాను. రెండో అంతస్తు నుంచి దూకడం వల్ల స్వల్ప గాయాలయ్యాయి," అని ఆమె ఏఎన్ఐ వార్తా సంస్థతో చెప్పారు.

## ఆదిలాబాద్ జిల్లాలో పిడుగుపాటుకు ఆరుగురు మృతి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అకాల వర్షం కారణంగా ఆదిలాబాద్ జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఏజెన్సీలోని గాదిగూడ మండలం పిప్పిరిలో 14 మంది వ్యవసాయ కూలీలతో కలిసి మొక్కజొన్న విత్తనాలు వేసే క్రమంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వర్షం నుంచి రక్షణ కోసం పొలంలోనే ఉన్న కర్రలతో ఏర్పాటు చేసుకున్న గుడిసెలోకి అందరూ వెళ్లారు. అదే సమయంలో గుడిసెపై పిడుగు పడటంతో పెందూర్ మాదర్రావు(45), సంజన(22), మంగం భీంబాయి(40), సిడాం రాంబాబు(45) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో గాపడిన 10 మందిని తొలుత ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆ తర్వాత రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అలాగే జిల్లాలోని బేల మండలం వేర్వేరు ప్రాంతాల్లో పడిన పిడుగుపాట్లకు (%ఉష్ట్రబఅనవతీర్‌శతీఎ%) ఇద్దరు మహిళలు మృతి చెందారు. సాంగిడిలో పొలం పనులు చేస్తున్న నందిని (30), సోన్కాస్‌లో పత్తి విత్తనాలు వేస్తున్న సునీత(35)పై పిడుగు పడడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఉదయం నేల తల్లికి నమస్కారం చేసి పొలం పనులకు వెళ్లిన వారు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## 36 మంది ఐఏఎస్‌ల బదిలీలు

- హైదరాబాద్ కలెక్టర్‌గా హరిచందన దాసరి నియామకం
- పలువురు ముఖ్య కార్యదర్శులు, వివిధ జిల్లాల కలెక్టర్ల మార్పు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో పెద్ద ఎత్తున ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. 36 మంది అధికారులను బదిలీ చేస్తూ సర్కారు నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శిగా ఎన్ శ్రీధర్‌ను నియమించింది. గనులశాఖ ముఖ్య కార్యదర్శిగా ఎన్ శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శిగా లోకేశ్ కుమార్‌ను బదిలీ చేసింది. ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా జ్యోతి బుద్ధ ప్రకాశ్, ఢిల్లీలో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా శశాంక్ గోయల్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ కలెక్టర్‌గా హరిచందన దాసరిని నియమించింది. టీజీ ఆయిల్ ఫెడ్ ఎండీగా జె శంకరయ్య, రిజిస్ట్రేషన్స్ అండ్స్ స్టాంప్స్ స్పెషల్ సెక్రెటరీగా రాజీవ్ గాంధీ హనుమంతును నియమించింది.

స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఈ నవీన్ నికోలస్, సమాచార శాఖ కమిషన్ కార్యదర్శిగా భారతి లక్‌పతి నాయక్, ఆర్అండ్ఆర్ కమిషనర్‌గా కిల్లు శివకుమార్ నాయుడు, సాధారణ పరిపాలన విభాగం సంయుక్త కార్యదర్శిగా చిట్టెం లక్ష్మి, మహిళా–శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా సృజనకు అదనపు బాధ్యతలు, నిజామాబాద్ కలెక్టర్‌గా టీ వినయ్ కృష్ణారెడ్డి, వ్యవసాయ సహకారశాఖ సంయుక్త కార్యదర్శిగా ఎల్ శివశంకర్‌ని నియమించింది. శివశంకర్‌కు విపత్తు నిర్వహణ సంయుక్త కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. గృహనిర్మాణశాఖ ప్రత్యేక కార్యదర్శి వీపీ గౌతమ్‌కు అదనపు బాధ్యతలు ఇవ్వగా.. సిద్దిపేట కలెక్టర్‌గా కే హైమావతి, సింగరేణి డైరెక్టర్‌గా పీ గౌతమ్‌ను నియమించింది. మత్స్యశాఖ డైరెక్టర్‌గా కే నిఖిల, పర్యటకశాఖ ఎండీగా వల్లూరి క్రాంతి, ఆరోగ్యశ్రీ హెల్త్ ట్రస్ట్ సీఈవోగా పీ ఉదయ్ కుమార్, టీజీపీఎస్సీ కార్యదర్శిగా ప్రియాంక ఆల, సంగారెడ్డి కలెక్టర్‌గా పీ ప్రావీణ్యను బదిలీ చేసింది. ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ డైరెక్టర్‌గా వాసం వెంకటేశ్వర్‌రెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టర్‌గా మిక్కిలినేని మను చౌదరి, ఖమ్మం కలెక్టర్‌గా అనుదీప్ దురిశెట్టి, హనుమకొండ కలెక్టర్‌గా స్నేహ శబరీష్, పౌర సరఫరాలశాఖ డైరెక్టర్‌గా ముజామిల్ ఖాన్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్..

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా కుకనార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో బుధవారం సాయంత్రం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందగా.. పలువురు గాయపడినట్టు సమాచారం. ఘటన స్థలంలో భారీగా ఆయుధాలు, సామగ్రిని స్వాధీనం బలగాలు చేసుకున్నట్టు భద్రత బలగాలు తెలిపాయి. ఈ ఘటనపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# మరమగ్గాల కార్మికులకు తెలంగాణ నేతన్న పొదుపు (త్రిఫ్ట్ ఫండ్) పథకం

- **చేనేత మరియు జౌళి శాఖ సహాయ సంచాలకులు జి.రాఘవరావు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ ప్రభుత్వం మరమగ్గాల కార్మికులకు తెలంగాణ నేతన్న పొదుపు (త్రిఫ్ట్ ఫండ్) పథకమును ప్రారంభించడం జరిగినది. ఇట్టి పథకములో చేరడానికి మరమగ్గాల కార్మికులు మరియు అనుబంద కార్మికులు అనగా డైయింగ్, డిజైనింగ్, వార్పింగ్, వైన్డింగ్, సైజింగ్, వైపని, బ్లీచింగ్, రోలింగ్ (గమ్మింగ్) కార్మికులు అర్హులు. ఇట్టి పథకము యొక్క కాల పరిమితి 2 సంవత్సరాలు. ఇట్టి పథకము వలన జిల్లాలోని మరమగ్గాల కార్మికులు మరియు అనుబంధ కార్మికులకు నెలకు గరిష్ఠ రూ. 1200/-వరకు లబ్ధిచేకూరును. ఇట్టి పథకములో చేరడానికి జియో ట్యాగింగ్ చేయబడిన మరమగ్గాల పై పని చేయుచున్న మరమగ్గాల కార్మికులు మరియు అనుబంధ కార్మికులు మాత్రమే అర్హులు. కార్మికుడు ప్రతి నెల తను పొందే కూల్లలో 8% బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్లయితే, ప్రభుత్వ వాటాగా 8% జమచేయబడును. గరిష్ఠముగా మరమగ్గాల నేత కార్మికుడు రూ.1200/- వరకు మరియు అనుబంధ కార్మికుడు రూ. 800/- వరకు పొదుపు చేసుకోవచ్చును. ప్రభుత్వము అంతే మొత్తాన్ని బ్యాంక్ ఖాతాలో జమ చేస్తుంది. (24) నెలల తర్వాత లబ్దిదారులకు కార్మికుని వాటా మరియు ప్రభుత్వ వాటా వడ్డీతో కలిపి బ్యాంక్ ఖాతా నుండి డ్రా చేసుకొని వినియోగించుకోవడానికై అనుమతించబడును.

ఇట్టి పథకమునకు సంబంధించి దరఖాస్తులను తేదీ 09 జూన్ 2025 నుండి కలెక్టరేట్ లోని సహాయ సంచాలకులు చేనేత మరియు జౌళి శాఖ. రాజన్న సిరిసిల్ల కార్యాలయం నందు సమర్పించగలరు. ఇట్టి పథకంలో అర్హులైన మరమగ్గాల మరియు అనుబంధ కార్మికులు చేరడానికి చివరి తేది 19.06.2025. ఇతర సమాచారం కొరకు సహాయ సంచాలకులు, చేనేత మరియు జౌళి శాఖ, రాజన్న సిరిసిల్ల కార్యాలయంలో సంప్రదించగలరని తెలిపారు.



## యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మ బోనాలు

**బలగం టీవీ,తంగళ్ళపల్లి**

బైండ్ల వారి ఆటపాటలతో,శివసత్తులు పూనకాలు యువకులు నృత్యాలు నడుమ తంగళ్ళపల్లి మండలం గోపాల్ రావు పల్లె గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మ బోనాలను నిర్వహించారు. ప్రతి ఇంటి నుండి బోనం తీసి, పోచమ్మ తల్లి ఆలయానికి ర్యాలీగా వెళ్లి,మొక్కలు సమర్పించినారు.ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సొసైటీ అధ్యక్షులు మిరాల శ్రీనివాస్ యాదవ్,ఉపాధ్యక్షులు అంబటి కిషన్ యాదవ్,యాదవ సంఘం అధ్యక్షులు జంగం శ్రీనివాస్ యాదవ్,ఉపాధ్యక్షులు కొండవేని కిషన్ యాదవ్,యాదవ సంఘం కమిటీ సభ్యులు కుక్కల రాములు యాదవ్,అంబటి కిషన్ యాదవ్, గొట్ల ఎల్లయ్య యాదవ్, నక్క నంపెల్లి యాదవ్, బోయిని శ్రీనివాస్ యాదవ్,కొండేవేని నడిపి పర్శయ్య యాదవ్, ఇరవేణి ఎల్లయ్య యాదవ్, కొండేవేని అనిల్ యాదవ్, కాలువ నంపెల్లి యాదవ్, మీరల ఎల్లయ్య యాదవ్,మరియు కులస్తులు తదితరులు పాల్గొన్నారు..



## నేరవేరుతున్న నిరుపేదల సొంతింటి కల

### -మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్

**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ పట్టణం 9 వార్డులో ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిన లబ్ధిదారుల ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ పాల్గొని భూమి పూజ నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి అహ్మద్ పాషా, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సారంపల్లి భాను, సిరిగిరి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



## ఆది శ్రీనివాస్ మంత్రి పదవి ఇవ్వాలి

**బలగం టీవీ, సిరిసిల్ల**

వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రుద్రంగి మండల కేంద్రంలో ఇందిరా చౌక్ వద్ద మున్నూరు కాపు కుల సంఘ సభ్యులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం ప్రజల క్షేమం కోసం పోరాడే ఆది శ్రీనివాస్ కి మంత్రి పదవి ఇస్తే పేద ప్రజలకి మరింత సహాయం అందిస్తారన్నారు. మంత్రి వర్గంలో మా మున్నూరు కాపు నాయకుడు ఆది శ్రీనివాస్ చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ మున్నూరు కాపు సభ్యులు ఎర్రం గంగా నరసయ్య, ఇప్ప మహేష్ ,నంద్యాడపు శ్రీను, పూదరి మహిపాల్, దరిపెల్లి మహేష్,ఎర్రం అరవింద్,ఇప్ప నరేష్, మున్నూరు కాపు సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా బొంత్ రాంమోహన్..

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియమితులైన బొంత్ రాంమోహన్‌కు, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కో-కన్వీనర్, ఆయన మిత్రుడు కనమేని చక్రధర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కనమేని చక్రధర్ రెడ్డి బొంత్ రాంమోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందించారు. బొంత్ రాంమోహన్ నియామకం పట్ల చక్రధర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.



# తెలంగాణ విద్యా వ్యవస్థ కుదేలు

### బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించి, రాష్ట్రంలో విద్యా వ్యవస్థ దారుణమైన స్థితిలో ఉందని ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో విద్యా వ్యవస్థ పూర్తిగా కుదేలైందని ఆయన విమర్శించారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదం దురదృష్టకరమని పేర్కొన్న ప్రవీణ్ కుమార్, దేశంలో విద్యా వ్యవస్థపై ప్రధాని మోడీకి రాహుల్ గాంధీ లేఖ రాశారని గుర్తు చేశారు. బీహార్‌లోని దర్భంగా జిల్లాలో ఒక పాఠశాలను సందర్శించినప్పుడు అక్కడి పరిస్థితులు దారుణంగా ఉన్నాయని రాహుల్ గాంధీ లేఖలో పేర్కొన్నారని తెలిపారు. అయితే, తెలంగాణలో బీహార్ కన్నా ఘోరమైన సమస్యలు విద్యా వ్యవస్థలో ఉన్నాయని, కాబట్టి రాహుల్ గాంధీ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాయాలని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో విద్యా వ్యవస్థ వెలుగు వెలిగిందని ప్రవీణ్ కుమార్ అన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక 660 గురుకులాలను ఏర్పాటు చేశారని, సైనిక, న్యాయ, ఫ్యాషన్, మెడికల్, సంగీతం కాలేజీలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి, జ్యోతిరావు పూలే విద్యానిధి కింద రూ. 20 లక్షలు అందించారని, కేసీఆర్ బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. అయితే, రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని రద్దు చేశారని విమర్శించారు. 'మన ఊరు మన బడి' కింద పాఠశాలలు అభివృద్ధి చేశారని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావాలనే విద్యా శాఖను తనవద్ద ఉంచుకున్నారని, కావాలనే విద్యా రంగాన్ని నాశనం చేస్తున్నారని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్' పేరుతో సీఎం రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని, ఒక్కో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు రూ. 200 కోట్లు ఇస్తున్నట్లు ప్రభుత్వం చెప్పిందని పేర్కొన్నారు. 2,560 మంది విద్యార్థులను ఒకే చోట ఉంచి పాఠాలు చెప్తామని సీఎం అంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం 'ఫోటో షాప్ ప్రభుత్వంగా' మారిందని ఎద్దేవా చేశారు.




కొడంగల్ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు ప్రారంభం కాలేదని, కొడంగల్ లో సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి రాజ్యాంగేతర శక్తిగా ఉన్నారని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. డిప్యూటీ సీఎం భట్టి నియోజకవర్గంలో కూడా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు స్టార్ట్ చేయలేదని తెలిపారు. రేవంత్ రెడ్డి చేస్తున్న దుర్మార్గాలు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

పాఠశాలల్లో శానిటేషన్ అత్యంత దారుణంగా ఉందని ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. విద్యార్థులు ఎవరి టాయిలెట్స్ వారే కడుక్కోవాలని ఐఏఎస్ అధికారి అంటున్నారని, దీనిపై జాతీయ ఎస్సీ కమీషన్, జాతీయ బాలల హక్కుల కమీషన్ ఆ ఐఏఎస్ అధికారికి నోటీసులు ఇచ్చాయని గుర్తు చేశారు. పాఠశాలల్లో కంప్యూటర్లు, ఇంటర్నెట్ లేకుండా విద్యార్థులు ఎలా ఏఐ నేర్చుకుంటారని ప్రశ్నించారు. తాము గురుకుల బాట చేపడితే తమపై కేసులు పెట్టారని, గౌలిదొడ్డిలో గురుకుల విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేశారని ప్రవీణ్ కుమార్ తెలిపారు. కామన్ సెన్స్ లేని అధికారులు విద్యా శాఖలో ఉన్నారని, విద్యార్థుల తల్లిదండ్రులను గురుకులాల్లోకి రానివ్వడం లేదని ఆరోపించారు. సర్దుబాటు పేరుతో ప్రభుత్వ స్కూళ్లను మూసేస్తున్నారని విమర్శించారు. నాయిని రాజేందర్ రెడ్డి, బల్మూరి వెంకట్ "బలుపు మాటలు మాట్లాడుతున్నారని", మీరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే తెలంగాణ ప్రజలు మిమ్మల్ని తరిమికొట్టడం ఖాయమని హెచ్చరించారు. తాము సెక్రటేరియట్‌లో కూర్చుని కమీషన్ల కోసం ఆరాటపడటం లేదని, ఢిల్లీకి మూటలు మోసే సంస్కృతి తమకు లేదని స్పష్టం చేశారు. గాంధీ భవన్‌లో కూర్చుని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. చివరిగా, "జాబ్ క్యాలెండర్ ఎక్కడ ఉంది రాహుల్ గాంధీ?" అని అన్నారు.




## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ప్రతాప రామకృష్ణ

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ పట్టణానికి చెందిన మైనార్టీ సీనియర్ నాయకులు ఎం.ఎ. హాజి బుధవారం ఉదయం పరమపదించారు. ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, బీజేపీ నాయకుడు హాజి కుటుంబ సభ్యులను పరామర్శించారు. హాజి బాయ్ మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన ఆయన, వారి ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా భగవంతుణ్ణి ప్రార్థించారు. అనంతరం తన సంతాపాన్ని ప్రకటించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయా పార్టీల నాయకులు తదితరులు ఉన్నారు. హాజి పట్టణ మైనార్టీ వర్గంలో సీనియర్ నాయకుడిగా సేవలందించారని, ఆయన లేని లోటు తీరనిదని పలువురు పేర్కొన్నారు.

## హత్యాయత్నం కేసులో నిందుతునికి జైలు శిక్షతో పాటు జరిమాన

**బలగం టీవీ, బోయినిపల్లి**

హత్యాయత్నం కేసులో నిందుతునికి 05 సంవత్సరాల జైలు శిక్ష, 400/- రూపాయల జరిమాన విధిస్తూ అసిస్టెంట్ సెషన్ కోర్టు న్యాయమూర్తి అజేయ్ కుమార్ జాధవ్ గురువారం రోజున తీర్పు వెల్లడించినట్లు వేములవాడ రూరల్ సి.ఐ శ్రీనివాస్ తెలిపారు. సి.ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండ గ్రామానికి చెందిన వేముల సుమ కుమారుడు వేముల సాయిచరణ్ అనే వ్యక్తి తేదీ 25-10-2020 దసరా సందర్భంగా గ్రామంలోని వేంకటేశ్వర ఆలయం వద్ద జరుగు దసరా సంబరాలకు వచ్చి ఉండగా అదే గ్రామానికి చెందిన కట్ట గంగరాజు అనే వ్యక్తి మద్యం సేవించి, మద్యం మత్తులో సిమెంట్ ఇటుకతో చరణ్ పై దాడి చేసి చంపడానికి ప్రయత్నం చేయగా, చరణ్ తల్లి అయిన వేముల సుమ బోయినిపల్లి పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసిందన్నారు. అప్పటి ఎస్.ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేయగా, దర్యాప్తు అధికారులు అయిన సి.ఐ లు నవీన్ కుమార్, బన్సీలాల్ లు దర్యాప్తు అనంతరం కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేయగా, సి.ఎం.ఎస్. ఎస్.ఐ రవీంద్రనాయుడు, కానిస్టేబుల్ మధుసూదన్, కోర్టు కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్ లు కోర్టులో సాక్ష్యులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజీ రెడ్డి వాధించగా కేసు పూర్వపారలను పరిశీలించి, అసిస్టెంట్ సెషన్ కోర్టు న్యాయమూర్తి అజేయ్ కుమార్ జాధవ్ నిందుతునికి 05 సంవత్సరాల జైలు శిక్షటు పారు 400 రూపాయల జరిమాన విధించినట్లు తెలిపారు.పైకేసులో నింధితునికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి విచారణ అధికారులు సి.ఐ లు నవీన్, బన్సీలాల్, ఎస్.ఐ శ్రీనివాస్ ప్రస్తుత సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ రాజ్ కుమార్ లను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజీ రెడ్డి, సి.ఎం.ఎస్ ఎస్.ఐ రవీంద్రనాయుడు, సి.ఎం.ఎస్ కానిస్టేబుల్ మధుసూదన్, కోర్ట్ కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్ లను జిల్లా ఎస్పీ గీతే మహేష్ ప్రత్యేకంగా అభినందించారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో
# నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్అన్నారు.గురువారం చందుర్తి మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల దుస్తులు, పాఠ్యపుస్తకాలను ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ శ్రీనివాస్ మాట్లాడుతూ గత పదేళ్లుగా నిర్లక్ష్యంగా మారిన విద్యలో మార్పు తీసుకువచ్చి, పెద విద్యార్థులకు మంచి విద్యను అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు.. విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగి తల్లిదండ్రుల ఆశాయలను నెరవేర్చాలని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను స్వంత బిడ్డల వలె చూసుకుంటుందని,రాష్ట్రంలో విద్య సంవత్సరం మొదలు కాక ముందే రాష్ట్రంలోని ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉంచడం జరిగిందనిఅన్నారు. ఈ సందర్భంగా మండల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కపిల నరేష్ తన కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో మూడవ తరగతిలో చేర్పించి విప్ చేతుల మీదగా అడ్మిషన్ పొందరు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం పట్ల విప్ నరేష్ ను అభినందించారు.. ఉపాధ్యాయులందరూ ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడానికి కృషి చేయాలని తెలిపారు.

# విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలి



**-విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం పెరగాలి**

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, సిరిసిల్ల:**

విద్యార్థులు తాము ఎంచుకున్న రంగమే లక్ష్యంగా చదవాలని వాటిని సాధించాలని, దీంతో తమ కుటుంబ ఆర్థిక పరిస్థితిని మార్చుకునే అవకాశం వస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యునిఫామ్స్, పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పుస్తకాలు,యునిఫామ్స్ ఇతర సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని ముందుకెళ్లాలని అన్నారు. ప్రతి విద్యార్థి పుస్తకాలలోని ప్రతి అంశంపై లోతుగా అధ్యయనం చేయాలని,ప్రతిరోజు జరిగే పాటలకు సంబంధించి అంశాలను స్కూలుకు రాకముందే చదివి వెళ్లాలని, దీంతో ప్రతి అంశంపై సమగ్ర అవగాహన వస్తుందని అన్నారు.

పాఠ్యాంశాలలో అనుమానాలను ఉపాధ్యాయులతో చర్చించి నివృత్తి చేసుకోవాలని,పాఠశాలలో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు.ఈ పాఠశాలలోని విద్యార్థులకు అన్ అకాడమీ ద్వారా ఐఐటి, నీట్ తదితర పోటీ పరీక్షలపై శిక్షణ అందించే ఏర్పాట్లు చేస్తామని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పేరెంట్ టీచర్ మీటింగ్లో సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లాలని, అలాగే ఎంఈఓ, డీఈఓ ఇతర అధికారులు దృష్టికి తీసుకురావాలని సూచించారు. పాఠశాలలో భోజనం తయారు చేసే విభాగంలో కట్టెల పొయ్యిని వెంటనే తొలగించాలని సిలిండర్లపై సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, జిల్లా విద్యాధికారి వినోద్, ప్రధానోపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.

# బడి పిల్లలకు అపూర్వ స్వాగతం..





**-సర్వంగ సుందరంగా.. సర్కారు బడి..**

**బలగం టీవీ, సిరిసిల్ల:**

బడి గంట మోగింది. బడులు పున ప్రారంభమయ్యాయి.. విద్యార్థులు మొదటి రోజే ఉత్సాహంగా బడిబాట పట్టారు. విద్యార్థుల రాకతో స్కూళ్లలో సందడి వాతావరణం నెలకొంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తెరుచుకున్నాయి. ఉదయమే విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడంతో సందడి నెలకొంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వెంకంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుబడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలను ప్రభుత్వ ఉపాధ్యాయులు సర్వంగా సుందరంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు , తల్లిదండ్రులకు




హెచ్ఎం మోర దామోధర్, ఉపాధ్యాయురాళ్లు రాణి, పద్మ, వెల్పుల సౌభాగ్యలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సదుపాయాలు, మౌళిక వసతుల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంస్ అందిస్తుందని తల్లిదండ్రులకు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదవి మంచి ఉన్నత స్థాయిలో రాణిస్తున్నారని, ప్రభుత్వా పాఠశాలల్లో చేర్పించాలని, మీ పిల్లలను తాము ఉన్నతముగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యా అని,మొదటి రోజు అడ్మీషన్ల కు మంచి స్పందన వస్తుందని హెచ్ఎం దామోధర్ తెలిపారు. తమకు సహకరించిన ఎంఈవో దూస రఘుపతి, కాంప్లెక్స్ హెచ్ ఎం సకినాల శ్రీనివాస్, విద్యాశాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులకు పాఠశాల ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపారు.



## శ్రీ రాజరాజేశ్వర జలాశయాన్ని పరిశీలించిన కేంద్ర బృందం

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని శ్రీ రాజరాజేశ్వర జలాశయం (మిడ్ మానేర్) ప్రాజెక్టును సెంట్రల్ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్ కాస్టింగ్ జాయింట్ సెక్రటరీ సెంతల్ రాజన్ చొక్కాలింగం ఆధ్వర్యంలో రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సైంటిస్ట్ సుధీర్ కుమార్, కృష్ణ గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ ఈ.ఈ ధీరజ్ సింఘాల్ లు పరిశీలించారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలను పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలు ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సెంతల్ రాజన్ మాట్లాడుతూ: ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజనలో భాగంగా హర్ ఘర్ జల్, హర్ ఖేతి పానీలో పథకాన్ని ఇక్కడ అమలు చేసేందుకు ప్రాజెక్టును పరిశీలించినట్లు తెలిపారు. మరో రెండు రోజులపాటు శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేర్) ప్రాజెక్టు నుండి వాటర్ వెళ్లే ఇతర ప్రాజెక్టులను పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు. ఆయన వెంట ప్రాజెక్టు ఈ.ఈ జగన్, డీ.ఈలు రాజు, శ్రీనివాస్, ఏ.ఈలు రాధిక, అనుపమ, వర్క్ ఇన్స్పెక్టర్ రాజేష్ తదితరులు ఉన్నారు.

## 14న జాతీయ లోక్ అదాలత్

**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ నీరజ**

**బలగం టీవీ, సిరిసిల్ల**



ఈ నెల 14వ తేదీ శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ నీరజ ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు, కక్షిదార్లు జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకొని, ప్రజలకు సంబంధించిన సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించు కోవాలని సూచించారు.



## ఇందిరమ్మ ఇల్లు పథకం పేదవారికి గొప్ప వరం

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**

ఇందిరమ్మ ఇల్లు పథకం పేదవారికి గొప్ప వరం లాంటిదనీ, ఇల్లు లేని వారికి ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని, లబ్ధిదారులు అందరు త్వరగా ఇంటి నిర్మాణం చేపట్టి స్వంత ఇంటి కల సాకారం చేసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.గురువారం వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి వీధిలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భూమి పూజ నిర్వహించారు..అనంతరం ముదిరాజ్ వెల్పర్ వారి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ప్రహరీ గోడ,సీసీ నిర్మాణనికి భూమి పూజ నిర్వహించారు.. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గంలో మంజూరి అయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం శరవేగంగా కొనసాగుతున్నాయని అన్నారు..రాష్ట్రంలోని నిరుపేదలు, గూడు లేనివారు ఆత్మగౌరవంతో బతకాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించారని తెలిపారు.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పినట్లుగా పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చెసి నిర్మాణం చేస్తున్నామని,రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందనీ అన్నారు.మంజూరైన లబ్ధిదారులు సొంత ఇంటి కల నెరవేరబోతున్నందుకు సంతోషంగా ఇంటి నిర్మాణాలు చేపట్టారనీ అన్నారు.




## నోటు పుస్తకాలు పంపిణీ

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని కొదురుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు శ్రీ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్(డి.వి107ఏ) వాసవి క్లబ్ (ఎం.ఆర్)కరీంనగర్ మరియు వాసవి క్లబ్ వనిత వాగ్దేవి వారి ఆధ్వర్యంలో సరస్వతి పథకంలో భాగంగా ప్రభుత్వం పాఠశాలలో శుక్రవారం రోజున నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కరీంనగర్ ప్రెసిడెంట్ కాముని తిరుమలేశ్ గుప్తా, సెక్రెటరీ చిట్టిమల్ల సత్యనారాయణ, వాసవి క్లబ్ వనిత, వాగ్దేవి, సెక్రెటరీ వొజ్జల రాజమణి, ట్రెజరర్ గంప హరిణి, జడ్.పి.హెచ్.ఎస్ ప్రధానోపాధ్యాయులు ఉషారాణి, ఎం.పీ.పీ.ఎస్ ప్రధానోపాధ్యాయులు రెడ్డి, సురేందర్ స్వామి, జోగినిపల్లి సత్యనారాయణ రావు, తదితరులు పాల్గొన్నారు.



# నేటి నుంచి ఇంట్రాస్క్వాడ్ పోరు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం టీమ్‌ఇండియాకు శుక్రవారం నుంచి మొదలయ్యే ఇంట్రాస్క్వాడ్ మ్యాచ్ ద్వారా మరింత తుదికూర్పుపై అంచనాకు వచ్చే అవకాశముంది. ప్రత్యర్థికి తమ ఎత్తులు ఏమాత్రం అంచనా వేయకుండా ఇండోర్‌నెట్స్ ద్వారా ప్రాక్టీస్ చేస్తున్న టీమ్‌ఇండియా క్రికెటర్లు.. నేటి నుంచి భారత్ 'ఏ'తో నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనున్నారు. సన్నాహక మ్యాచ్‌పై బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ మాట్లాడుతూ 'టెస్టు మ్యాచ్‌కు సన్నాహకంగా ఇది ఉపయోగపడనుంది. రోజుకు 90 ఓవర్ల చొప్పున నాలుగు రోజుల పాటు 360 ఓవర్లు ఆడటం ద్వారా ప్లేయర్ల సామర్థ్యాన్ని పరిశీలించే అవకాశం లభిస్తుంది. ఈనెల 20న ఇంగ్లండ్‌తో మొదలయ్యే తొలి టెస్టు కోసం తుది జట్టు కూర్పుపై అంచనాకు వస్తాం. ముఖ్యంగా రవీంద్రజడేజా, కుల్దీప్‌యాదవ్..ఈ ఇద్దరిలో ఎవరిని ఆడించాలనే దానిపై సందిగ్ధత ఉన్నది. దీనికి తోడు ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ మధ్య పోటీ నెలకొన్నది. బుమ్రా ఫిట్‌నెస్‌పై ఎలాంటి ఆందోళనా అవసరం లేదు. పూర్తి స్థాయి మ్యాచ్ ఆడేందుకు అతను సిద్ధంగా ఉన్నాడు' అని పేర్కొన్నాడు.


# భారత్‌లో తొలి రగ్బీ ప్రీమియర్ లీగ్

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్‌లో తొలి రగ్బీ ప్రీమియర్ లీగ్‌కు వేళయైంది. ఈ నెలలో మొదలుకానున్న లీగ్ ఆధారిత రగ్బీ ఎస్ టోర్నీలో వివిధ దేశాల ప్లేయర్లు బరిలోకి దిగుతున్నారు. అంతర్జాతీయ స్థాయి ప్లేయర్లతో కలిసి తమ ప్రతిభకు మెరుగులు అద్దుకునేందుకు దేశ రగ్బీ ఆటగాళ్లకు మంచి అవకాశమని నిర్వాహకులు పేర్కొన్నారు. జీఎంఆర్ రగ్బీ ప్రీమియర్ లీగ్ కోసం ఇండియన్ రగ్బీ ఫుట్‌బాల్ యూనియన్(ఐఆర్ఎఫ్‌యూ)తో క్యాప్‌జెమిని సంస్థ తమ భాగస్వామ్యాన్ని అందించనుంది. రగ్బీ 7ఎస్ పార్మాట్‌లో జరిగే ఈ లీగ్‌లో ప్లేయర్ల ప్రదర్శన మెరుగు పర్చడం, ఆటగాళ్ల ప్రొఫైల్స్‌ను అభివృద్ధి చేయడంలో ఈ సంస్థ సహకరించనుంది. ఈ కార్యక్రమంలో ఇండియన్ రగ్బీ ఫుట్‌బాల్ యూనియన్ అధ్యక్షుడు రాహుల్ బోస్, జీఎంఆర్ స్పోర్ట్స్ సీఈవో సత్యం త్రివేది, క్యాప్‌జెమిని సీఈవో అశ్విన్ పాల్గొన్నారు.

# ఆగస్టు 27న 'రివాల్వర్ రీటా'

**బలగం టీవీ, హైదరాబాద్**




మహానటి కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'రివాల్వర్ రీటా'. ఉమెన్ సెంట్రిక్ కథా చిత్రంగా రూపొందుతోన్న ఈ చిత్రానికి జేకే చంద్రు దర్శకత్వం వహిస్తున్నారు. రెండేళ్ల క్రితమే మొదలైన ఈ సినిమా ఎట్టకేలకు రిలీజ్‌కు సిద్ధమైంది. తమిళంలో పాటు తెలుగులో ఈ మూవీ విడుదల కానుంది. తాజాగా రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తూ మేకర్స్ స్పెషల్ వీడియో రిలీజ్ చేశారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం వినాయక చవితి సందర్భంగా ఆగస్టు 27న థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని ప్రకటిస్తూ కీర్తి సురేష్ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. తాజాగా విడుదలైన ఈ వీడియో చూస్తే ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. రెడిన్ కింగ్‌స్లీ, మైమ్‌గోపి, సెంద్రాయిన్, స్టంట్ మాస్టర్ సూపర్ సుబ్బరాయన్‌లు ముఖ్యపాత్రలు పోషించిన ఈ సినిమాను ఫ్యాషన్ స్టూడియోస్, ది రూట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

# కన్నప్ప' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ రద్దు

**బలగం టీవీ, హైదరాబాద్**



మంచు విష్ణు కన్నప్ప జూన్ 27న విడుదల కానుండగా, కొద్ది రోజులుగా జోరుగా ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో జూన్ 13 కన్నప్ప సినిమా ట్రైలర్ రిలీజ్ చేస్తామని ప్రకటించారు. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ మధ్యప్రదేశ్ లోని ఇండోర్ లో ప్లాన్ చేసారు. అయితే ప్రస్తుతం కన్నప్ప ట్రైలర్ లాంచ్ ఈవెంట్ క్యాన్సిల్ అయింది. విమాన ప్రమాదం కారణంగానే కన్నప్ప ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ని వాయిదా వేస్తున్నామని , ట్రైలర్ రిలీజ్ ని ఒకరోజు వాయిదా వేస్తున్నట్టు విష్ణు తెలిపారు. మరణించిన వారికి సంతాపం తెలియజేశారు విష్ణు.

# ఆస్ట్రేలియాకే ఆధిక్యం

- **తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 138 పరుగులకే ఆలౌట్**
- **218 పరుగుల ఆధిక్యంలో ఆస్ట్రేలియా**
- **రెండో ఇన్నింగ్స్‌లోనూ ఆసీస్ 8 వికెట్లు డౌన్**



**బలగం టీవీ, హైదరాబాద్**

ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ పోరు రసవత్తరంగా సాగుతోంది. లార్డ్స్ మైదానం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో, రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తమ రెండో ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. దీంతో, మొత్తం 218 పరుగుల భారీ ఆధిక్యం సంపాదించింది. ప్రస్తుతం క్రీజులో మిచెల్ స్టార్క్ (16 బ్యాటింగ్), నాథన్ లియాన్ (1 బ్యాటింగ్) ఉన్నారు.

రెండో రోజు ఆటలో దక్షిణాఫ్రికాను 138 పరుగులకే కట్టడి చేసిన కమిన్స్ సేన.. తొలి ఇన్నింగ్స్‌లో 74 పరుగుల విలువైన ఆధిక్యం దక్కించుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్ల ధాటికి 57.1 ఓవర్లలో కేవలం 138 పరుగులకే కుప్పకూలింది. ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్ (6/28) అద్భుతమైన బౌలింగ్‌తో సఫారీ పతనాన్ని శాసించాడు. బెడింగ్‌హామ్ (45), కెప్టెన్ బవుమా (36) మాత్రమే కాస్త ప్రతిఘటన చూపించారు. మిగిలిన బ్యాటర్లు కనీస పోరాటపటిమ కూడా కనబరచలేకపోయారు. మార్క్‌రమ్ (0), ముల్డర్ (6), స్టబ్స్ (2), వెరీన్ (13), మార్కో జాన్సెన్ (0), కేశవ్ మహరాజ్ (7), రబాడ (1) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. కమిన్స్‌కు తోడుగా మిచెల్ స్టార్క్ రెండు వికెట్లు, హేజిల్‌వుడ్ ఒక వికెట్ పడగొట్టారు.

ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు వచ్చి ఆట ముగిసే సమయానికి 144/8 చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో కీలకమైన ఆధిక్యం దక్కిన ఆనందం కంగారూలకు ఎంతోసేపు నిలువలేదు. సఫారీ పేస్ దళాన్ని తొలి 10 ఓవర్ల పాటు సమర్థవంతంగా ఎదుర్కొన్న ఆసీస్.. ఆ తర్వాత పట్టు కోల్పోయింది. రబాడా గత ఇన్నింగ్స్‌లో మాదిరిగానే ఒకే (11వ) ఓవర్లో ఖవాజా (6), గ్రీన్ (0)ను ఔట్ చేసి ఆసీస్‌కు డబుల్ షాకులిచ్చాడు. టీ విరామం తర్వాత బంతినందుకున్న ఎంగిడి నిప్పులు చెరిగే బౌలింగ్‌తో కంగారూ మిడిలార్డర్ పనిపట్టాడు. యాన్సెన్.. లబూషేన్ (22)ను వెనక్కిపంపగా స్మిత్ (13), వెబ్‌స్టర్ (7), కమిన్స్ (6) ఎంగిడి పేస్‌కు దాసోహమయ్యారు. 73 రన్స్‌కే 7 వికెట్లు నష్టపోయిన ఆసీస్‌ను అలెక్స్ క్యారీ, మిచెల్ స్టార్క్ ఆదుకున్నారు. వీరిరువురూ ఆసీస్ ఆధిక్యాన్ని 200 పరుగులు దాటించడంతో పాటు ఆ జట్టును పటిష్టస్థితిలో నిలబెట్టారు. అయితే రబాడా.. క్యారీని ఔట్ చేసి 61 పరుగుల ఈ భాగస్వామ్యానికి తెరదించాడు. సఫారీ పేసర్లు లుంగి ఎంగిడి (3/35), కగిసో రబాడా (3/44), వియాన్ మల్డర్ (1/14) ధాటికి టాపార్డర్, మిడిలార్డర్ విలవిల్లాడినా వికెట్ కీపర్ బ్యాటర్ అలెక్స్ క్యారీ (43), మిచెల్ స్టార్క్ (16లి) నిలబడటంతో కంగారూలు లీడ్ సాధించారు. ు.

**సంక్షిప్త స్కోర్లు**

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 212 ఆలౌట్, దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 138 ఆలౌట్ (బెడింగ్హామ్ 45, బవుమా 36, కమిన్స్ 6/28, స్టార్క్ 2/41)బీ ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 40 ఓవర్లలో 144/8 (క్యారీ 43, లబూషేన్ 22, ఎంగిడి 3/35, రబాడా 3/44)

# యోధుడిగా గోపీచంద్

**బలగం టీవీ, హైదరాబాద్**




హీరో గోపీచంద్ తన తాజా చిత్రంలో చారిత్రక యోధుడి పాత్రలో కనిపించనున్నారు. 7వ శతాబ్దం నేపథ్యంలో రూపొందిస్తున్న ఈ చిత్రానికి సంకల్ప్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీనివాసా చిట్టూరి నిర్మాత. 'గోపీచంద్33' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్నది. గురువారం గోపీచంద్ పుట్టినరోజుని పురస్కరించుకొని స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. మంచుతో కప్పబడిన పర్వతశ్రేణుల నడుమ మొదలైన టీజర్ ఆసక్తికరంగా సాగింది. పొడవాటి జుట్టు, శరీరమంతా గాయాలు, నుదుటిన వీరతిలకం ధరించి యోధుడి పాత్రలో ఆయన కనిపించిన తీరు సర్‌ప్రైజింగ్‌గా ఉంది. 7వ శతాబ్దం నేపథ్యంలో ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయని చారిత్రక ఘటనను ఆవిష్కరిస్తూ, చరిత్ర మరిచిపోయిన ఓ అధ్యాయానికి జీవం పోసే చిత్రమిదని మేకర్స్ తెలిపారు. 'అతనో యోధుడు. విప్లవాన్ని రగిలించడానికి సిద్ధంగా ఉన్నాడు' అంటూ చిత్రబృందం ఈ వీడియోను పంచుకుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షఉటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రానికి నిర్మాణ సంస్థ: శ్రీనివాసా సిల్వర్‌స్క్రీన్, రచన–దర్శకత్వం: సంకల్ప్ రెడ్డి.

# 14న గద్దర్ ఫిల్మ్ అవార్డులు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఈ నెల 14న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవ వేడుక వివరాలను తెలియజేసేందుకు గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దిల్‌రాజు మాట్లాడారు. ' 'గతంలో ఎన్నడూ ఎరుగని విమాన ప్రమాదం నేడు జరిగింది. దేశమంతా దిగ్భ్రాంతికి లోనై ఉన్నది. నిజానికి ఈ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రావాల్సివుంది. కానీ ఈ విషాదం వల్ల ఆయన రాలేకపోయారు. అందుకనే ఆయన తరపున వివరాలు నేనే అందిస్తున్నా. 14ఏండ్ల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ ఫిల్మ్ అవార్డులను నెలకొల్పింది. ఈ నెల 14న వైభవంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాం. సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం మొదలవుతుంది. 2014 నుంచి 2023 వరకూ ప్రతి ఏడాదీ ప్రథమ, ద్వితీయ, తృతీయ ఉత్తమ చిత్రాలుగా ఎంపికైన మూడు సినిమాలకు అవార్డులు ఇవ్వనున్న విషయం తెలిసిందే. ప్రతి ఉత్తమ చిత్రానికీ హీరో, హీరోయిన్, దర్శకుడు, నిర్మాత ఇలా నాలుగు కేటగిరీల్లో అవార్డులను అందిస్తాం. ఇక 2024కు సంబంధించి, అన్ని కేటగిరీలకూ చెందిన అవార్డులు ఉంటాయి. తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయవలసిందిగా ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా కోరుతున్నాను' అని దిల్‌రాజు చెప్పారు.

# సీనియర్ నిర్మాత మహేంద్ర కన్నుమూత

**బలగం టీవీ, హైదరాబాద్**



సీనియర్ నిర్మాత మహేంద్ర (ఏ.ఏ ఆర్ట్స్ అధినేత) బుధవారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచారు.ఆయన వయసు 75 సంవత్సరాలు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మహేంద్ర , చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి లోకాన్ని విడిచారు. ఇక 'ప్రేమించి పెళ్ళి చేసుకో' అనే మూవీతో నిర్మాతగా మారిన మహేంద్ర ఆ తర్వాత 'ఆరని మంటలు', 'బందిపోటు రుద్రమ్మ', 'తోడు దొంగలు', 'ఎదురులేని మొనగాడు', 'ఢాకూ రాణి', 'ప్రచండ భైరవి', 'కనకదుర్గ వ్రత మహాత్యం' వంటి చిత్రాలతో నిర్మాతగా విజయాన్ని అందుకున్నారు. శ్రీహరి ని హీరోగా పరిచయం చేస్తూ 'పోలీస్' చిత్రాన్ని నిర్మించింది కూడా ఆయనే. మహేంద్ర కేవలం వ్యాపార దృష్టితో కాకుండా, ప్రేక్షకులకు మంచి కంటెంట్ అందిం చాలనే సంకల్పంతో చిత్రాలను నిర్మించారనే అభిప్రాయం పరిశ్రమలో ఉంది.